క్లుప్తంగా

ఆకట్టుకున్న 'శ్రీకృష్ణ జననం' నాటకం



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ వెంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై విశ్వనాథ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో యక్షగాన మహోత్సవం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. తమిళనాడు మేలట్టూరుకు చెందిన భాగవతమేళా నాట్య నాటక సంఘం ఆధ్వర్యంలో 'శ్రీకృష్ణ జననం కంసవధమ్' అనే తెలుగు యక్షగానం ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. శ్రీకృష్ణుడిగా విజయ్ మాధవన్, కంసుడిగా ఎస్. కుమార్, వసు దేవుడిగా ఆర్. అరవింద్, దేవకిగా శ్రీకాంత్ నటరాజన్, యశోదగా ప్రసన్న నటించారు. అనంతరం నాట్యాచార్యులు ఎస్. కుమార్‌ను బెంగళూరు నాగరత్నమ్మ స్మారక పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, విశ్వనాథ సాహిత్య అకాడమీ చైర్మన్ మద్దినేని సింహ కౌటిల్య చౌదరి, కార్యదర్శి మోదుగుల రవికృష్ణ, కన్వీనర్ సెట్లం చంద్రమోహన్ పాల్గొన్నారు.

మరో రెండు మొబైల్ ఫోన్ల అప్పగింత



నగరంపాలెం: మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న మరో ఇద్దరు బాధితులకు గుంటూరు జిల్లా పోలీసులు వాటిని అప్పగించారు. గతనెల 28న గుంటూరు జిల్లా పోలీసులు మొబైల్ ఫోన్లు పాగొట్టుకున్న బాధితుల సౌకర్యార్థం వాట్సాప్ నంబర్ 86888 31574ను అందుబాటులోకి తీసుకువచ్చిన విషయం విదితమే.. ఈ క్రమంలో వాట్సాప్ నంబర్‌కు గుంటూరు నగర వాసులైన ఎం.హరీష్, ఎం.మహేష్‌బాబు 'హాయ్' అని మేసేజ్ పంపించారు. దీంతో లింక్‌తో కూడిన మేసేజ్‌లు వారికి రావడంతో ఓపెన్‌చేసి వివరాలు తెలిపి, అప్లికేషన్ సబ్మిట్ చేశారు. అనంతరం మొబైల్ ఫోన్లను ట్రాక్ చేసి పోలీసులు గుర్తించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని స్పందన హాలులో ఏఎస్పీ (క్రైం) శ్రీనివాసరావు, ఐటీ కోర్ ఇన్‌చార్జి ఎస్ఐ వెంకటకృష్ణ బాధితులకు మొబైల్ ఫోన్లను అప్పగించారు. ఈ సందర్భంగా ఇద్దరూ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజల వద్దకే పాలన.. సచివాలయాల సాధన

రేటూరులో గ్రామ సచివాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సుచరిత



రేటూరు(కాకుమాను): ప్రజల వద్దకే ప్రభుత్వ పాలనను తీసుకెళ్లాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారని మాజీ మంత్రి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. మండలంలోని రేటూరులో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాల లబ్ధి, ప్రజా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలనే లక్ష్యంతో గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసి, లక్షల ఉద్యోగాలు కల్పించిన ఘనత దేశ చరిత్రలో ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందని సుచరిత తెలిపారు. సచివాలయాల్లో దాదాపు 413 సేవలను అందిస్తున్నట్లు ఆమె చెప్పారు. మూడున్నరేళ్ల కాలంలో ఒక్క రేటూరు గ్రామానికి వివిధ పథకాల ద్వారా సుమారు రూ.10 కోట్లు అందించినట్లు ఆమె తెలిపారు.కులాలు, మతాలు, ప్రాంతాలు, పార్టీలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని సుచరిత కొనియాడారు. గ్రామాల్లో ఇన్ని అభివృద్ధి పనులు చేస్తుంటే ప్రతిపక్ష నాయకులు కళ్లుండి కబోదుల్లాగా మాట్లాడడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలుత గ్రామంలో ఏర్పాటు చేసిన మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ షేక్ సైదా, ఉప సర్పంచ్ వల్లూరి సుధాకర్, రేటూరు సొసైటీ అధ్యక్షుడు చిరంజీవి, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ గేరా పున్నారావు, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు వింతా రాఘవరెడ్డి, ప్రత్తిపాడు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మెరిగల రవిబాబు, మండల ఉపాధ్యక్షుడు పెదపూడి కపిల్, కో-ఆప్షన్ సభ్యులు షేక్ సుభాని, వక్ఫ్ బోర్డు జిల్లా డైరెక్టర్ పొన్నూరు షేక్ కరిముల్లా, మాజీ ఎంపీటీసీ వల్లూరి చిట్టిబాబు, పంచాయతీ రాజ్ డీఈ రమేష్‌బాబు, ఏఈ ఆనందరావు, ఎంపీడీఓ కె.శరత్ బాబు, ఈఓపీఆర్డీ నాగానంద్, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం సోమశేఖర్, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు నిర్దేశిత గడువులోగా పరిష్కారం

నగర కమిషనర్ కీర్తి చేకూరి



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నకమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ప్రజల నుంచి సమస్యలపై అందే ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, సచివాలయ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తప్పవని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం స్పందన నిర్వహించారు. తొలుత గత వారం ఫిర్యాదుల పరిష్కారం, స్పందన పోర్టల్, ఈఆర్‌పీ, వాట్సాప్, కాల్ సెంటర్ల ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో, సంబంధిత కార్యదర్శులతో సమీక్షించారు. ప్రజల సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదుదారుడికి సమాచారం తెలియజేయాలని చెప్పారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫోటోలు జత చేయాలని సూచించారు. సచివాలయ కార్యదర్శుల పనితీరు, సేవలు, స్థానిక సమస్యలపై నోడల్ అధికారులు పర్యవేక్షణ చేయాలని కమిషనర్ చెప్పారు. ప్రతి సోమవారం సచివాలయ పనితీరుపై సమీక్ష చేయాలని అదనపు కమిషనర్‌ని ఆదేశించారు. ప్రతి రోజు వార్డు సచివాలయాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు జరిగే స్పందనలో కార్యదర్శులు అందరూ అందుబాటులో ఉండాలని ఆమె తెలిపారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 42 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి -19, ఇంజినీరింగ్ విభాగానికి- 6, ప్రజారోగ్య విభాగానికి- 7, రెవెన్యూ విభాగానికి -5, ఉపా సెల్ విభాగానికి సంబధించి- 3, అకౌంట్స్ విభాగానికి సంబంధించి- 2 చొప్పున ఫిర్యాదులు అందాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, డెప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎస్ఈ భాస్కర్, సిటీప్లానర్ మూర్తి, డెప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, సీఎంఓహెచ్ డాక్టర్ విజయలక్ష్మి, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరింటిండెంట్ వెంకటేశ్వర్లు, ఏసీపీలు, ఆర్ఓలు, ఈఈలు, ఎస్ఎస్‌లు, సూపరింటిండెంట్లు పాల్గొన్నారు.

సాధికారతతోనే మహిళల సమస్యలకు పరిష్కారం

వీసీ రాజశేఖర్



సమావేశంలో ప్రసంగిస్తున్న రాజశేఖర్

ఏఎన్‌యూ: మహిళల పరిపూర్ణ సాధికారతే వారు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు పరిష్కారమని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ తెలిపారు. నాగార్జున యూనివర్సిటీ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ' వైలెన్స్ యాన్ ఇంప్లిమెంట్ టూ ఉమెన్ ఎంపవర్‌మెంట్' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సును సోమవారం వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న హింసలపై పలు ఉద్యమాలు జరుగుతున్నా, మహిళా సాధికారతపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని తెలిపారు. రిజిస్ట్రార్ బి. కరుణ మాట్లాడుతూ మహిళలపై నేటికీ హింసలు పలు రూపాల్లో ఉంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రెక్టార్ పి. వరప్రసాదమూర్తి ప్రసంగిస్తూ మహిళలపై జరుగుతున్న హింస నియంత్రణ, సాధికారత పెంపునకు పరిష్కార మార్గాలు చూపడానికి ఈ సదస్సు దోహదం చేస్తుందని తెలిపారు. ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సర్వీస్ డీన్ చైతన్య కుమారి ప్రసంగిస్తూ మహిళలపై హింసకు ప్రభుత్వాలు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని తెలిపారు. హైదరాబాద్ జాతీయ మహిళా అధ్యయన కేంద్రం అధ్యాపకులు షీలా నారాయణ్ ప్రసంగిస్తూ ప్రతి ఏడాది ఎంతో మంది మహిళలకు పలు రకాల హింసలకు గురవుతున్నారన్నారు. మహిళలు విద్యావంతులవ్వడం ద్వారానే అవరోధాల్ని అధిగమించవచ్చని సూచించారు. ఏపీ హైకోర్టు న్యాయవాది నీరు మిశ్రా, విజయవాడ సిద్ధార్థ మెడికల్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ ప్రభాకర్ ఆకురాతి ప్రసంగించారు. డైరెక్టర్ డాక్టర్ కె.వి.శాంతిశ్రీ సదస్సులో చర్చిస్తున్న అంశాల్ని వివరించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇద్దరు అదృశ్యం

గుంటూరు ఈస్ట్: ఇద్దరు అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. శ్యామలానగర్‌కు చెందిన బాలసైదులు భార్య వెంకటపద్మ ఈనెల 4న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో సైదులు సోమవారం పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- కొరిటెపాడుకు చెందిన వీధుల శ్రీనివాస్ గతనెల 19న ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని ఆచూకీ కోసం వెతికిన ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు సోమవారం అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కుల దూషణపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: కులం పేరుతో దూషించిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెంటచింతలకు చెందిన దేగల సైదారాజు గుంటూరు కన్నావారితోటకు చెందిన ఆలపాటి శ్రావణ్‌కుమార్‌కు రూ. 2.50 లక్షలు అప్పుగా ఇచ్చాడు. హామీ కింద చెక్కులు, నోట్లు ఇచ్చాడు. అయితే, డబ్బులు తిరిగి ఇవ్వడం లేదు. డిసెంబరు 10న సైదారాజు కన్నావారితోటలోని శ్రావణ్‌కుమార్ ఇంటికి వచ్చి డబ్బులు ఇవ్వాలని కోరాడు. ఇద్దరి మధ్యా గొడవ జరిగింది. శ్రావణ్‌కుమార్ తాను డబ్బులు ఇవ్వనని చెబుతూ, సైదారాజును కులం పేరుతో దూషించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు.

సింగిల్ నంబరు ఆట నిర్వహిస్తున్న ఇద్దరిపై కేసు

గుంటూరు ఈస్ట్: సింగిల్ నంబరు ఆట నిర్వహిస్తున్న ఇద్దరిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శారదా కాలనీ ఆర్చి సమీపంలో కొందరు సింగిల్ నంబరు ఆట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం దాడి చేశారు. కడియం విజయకుమార్, నరసింహారావును అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ. 2,900 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో దూకి వివాహిత ఆత్మహత్య



చేబ్రోలు: మండలంలోని వడ్లమూడి గ్రామ సమీపంలోని కొమ్మమూరు చానల్‌లో దూకి గుర్తుతెలియని మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. వడ్లమూడిలోని సంగం జాగర్లమూడి లాకుల వద్ద సుమారు 25 సంవత్సరాలున్న వివాహిత వంతెనపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. సమీపంలోని వారు గమనించి ఆమెను కాపాడేందుకు ప్రయత్నించారు. కానీ ఫలితం లేకపోయింది. కాలువలో మహిళ మృతదేహాన్ని బయటకు తీశారు. మృతురాలి మెడపై కేనెల్ ఉండటంతో వైద్యశాలలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు భావించారు. అనారోగ్య సమస్యల కారణంగా ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని, వడ్లమూడి, తెనాలి పరిసర ప్రాంతాలకు చెందిన మహిళగా భావిస్తున్నారు. మృతురాలి ఆచూకీ తెలిసిన వారు చేబ్రోలు పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కె.ఆనంద్ కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాస్మోటిక్ వైద్యం వరం

అడిషనల్ డీజీపీ డాక్టర్ రవిశంకర్ అయ్యన్నార్



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ సుమితా శంకర్, డాక్టర్ నిశాంత్. చిత్రంలో డాక్టర్ రవిశంకర్ అయ్యన్నార్, డాక్టర్ నరేంద్రరెడ్డి తదితరులు

గుంటూరు మెడికల్: ఆత్మనూన్యతతో బాధపడే వారికి ముఖ్యంగా మహిళలకు కాస్మోటిక్ వైద్యం వరం లాంటిదని అడిషనల్ డీజీపీ (లా అండ్ ఆర్డర్) డాక్టర్ రవిశంకర్ అయ్యన్నార్ తెలిపారు. స్థానిక అరండల్‌పేటలోని అమేజ్ మెడ్‌స్పా కాస్మోటిక్, ప్లాస్టిక్ సర్జరీ సెంటర్ ఏడో వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రవిశంకర్ అయ్యన్నార్ మాట్లాడుతూ మెట్రోపాలిటన్ నగరాల్లో లభించే కాస్మోటిక్ వైద్య సేవల్ని గుంటూరులోనే అమేజ్ మెడ్‌స్పా అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పలు కాస్మోటిక్, ప్లాస్టిక్ సర్జరీలను ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా అందిస్తుందని వెల్లడించారు. అమేజ్ మెడ్‌స్పా నిర్వాహకురాలు, కాస్మోటిక్ సర్జన్ డాక్టర్ సుమితా శంకర్ మాట్లాడుతూ తమ హాస్పిటల్‌కు అనేక మంది వివిధ బాధలతో వచ్చి సంతోషంతో వెళ్లారని తెలిపారు. కార్యక్రమంలో కాస్మోటిక్ సర్జన్ డాక్టర్ సాధనాల నిశాంత్, సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, ప్రసూతి, సంతాన సాఫల్య నిపుణురాలు డాక్టర్ బూసిరెడ్డి దీప్తిరెడ్డి, సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ అనుమల కవిత, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, డాక్టర్ కారుమూరి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

దర్గాలో భక్తిశ్రద్ధలతో చంద్రమాన ప్రార్థనలు



దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న పీఠాధిపతులు

లక్ష్మీపురం: నల్లచెరువు ఎత్తురోడ్డు సెంటర్‌లోని హజ్రత్ మొహియుద్దీన్ పాలెంలోని మహబూబ్ సుభాని 17వ మనువలు హజ్రత్ సయ్యద్ షా మొహియుద్దీన్ బాద్‌షా ఖాదిరి దర్గా ప్రాంగణంలో చంద్రమాన 21వ రోజు, స్వర్గీయ హజ్రత్ నూరుల్ ముస్తఫా ఖాదిరి జన్మదిన వేడుకల్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా దర్గా ప్రాంగణంలోని బాబా సమాధిని పూలతో అలంకరించి, ధూప, దీపాలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి సయ్యద్ షా సులేమాన్ అల్ హసనీ ఉల్ హుసైనీ ఖాదిరి మాట్లాడుతూ నెలలో ప్రతి గురువారం, ప్రతి నెల చంద్రమాన 21వ రోజు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని చెప్పారు. వచ్చే నెల 13వ తేదీ నుంచి దర్గాలో ఉరుసు మహోత్సవ వేడుకల్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉరుసు మహోత్సవంలో మొక్కులను తీర్చుకునేందుకు భక్తులు ముందుగానే దర్గా పీఠాధిపతులకు సమాచారం అందించాల్సిందిగా కోరారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బాబా మురీదులు, స్థానికులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యతో సమగ్ర వికాసం



మాట్లాడుతున్న ఏఎస్పీ సుప్రజ



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

ఏఎస్పీ సుప్రజ

గుంటూరు ఎడ్యుకేషన్: విలువలతో కూడిన విద్యతో విద్యార్థుల్లో సమగ్ర వికాసం సాధ్యపడుతుందని ఏఎస్పీ కె.సుప్రజ పేర్కొన్నారు. శ్యామలానగర్‌లోని శ్రీ వేంకటేశ్వర బాలకుటీర్‌లో 48వ బాలల వార్షికోత్సవాన్ని సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఎస్పీ సుప్రజ మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన చదువుతో తెలివితేటల్ని పెంచుకుని, ఉన్నతంగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. మార్కుల కంటే విలువలు ముఖ్యమని, జ్ఞాన సముపార్జన గావించడమే విద్యకు పరమావధి అని తెలిపారు. ఆర్వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యతోనే విద్యార్థుల్ని సన్మార్గంలో నడిపించగలమని పేర్కొన్నారు. సాంకేతిక విజ్ఞానాన్ని వినియోగించుకునే విధానం, ఆహారం-ఆరోగ్యం మధ్యన ఉండే అవినాభావ సంబంధాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో బాలకుటీర్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎన్. మంగాదేవి, ఉపాధ్యక్షుడు రావెల సాంబశివరావు, బాలబంధు బి.వి. నరసింహారావు, సీఏవో దుర్గా రఘురాం, సంయుక్త కార్యదర్శి జయశ్రీ, ప్రిన్సిపాల్ సుధామాధవి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నెల్లూరు యువకుడి మృతి



చేబ్రోలు: ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో యువకుడు అక్కడికక్కడే మరణించిన ఘటన చేబ్రోలు మండలం నారాకోడూరులో సోమవారం జరిగింది. నెల్లూరుకు చెందిన చేజర్ల చంద్రశేఖర్ (23) గుంటూరులో చికెన్ స్టాల్‌లో కార్మికుడుగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై గుంటూరు నుంచి బాపట్లకు బయలు దేరాడు. మండల పరిధిలోని నారాకోడూరు బిర్యానీ హోటల్ సమీపంలో ఎదురుగా బాపట్ల నుంచి గుంటూరు వస్తున్న ఆర్టీసీ బస్సు ప్రమాదవశాత్తూ అతనిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చంద్రశేఖర్‌ను 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ అతను మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. చేబ్రోలు ఎస్ఐ కె.ఆనంద్ కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

శ్మశానవాటికల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

మేయర్ కావటి



శ్మశానవాటికలో పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: నగర శ్మశానవాటికల్లో మౌలిక వసతుల కల్పనకు నగరపాలక సంస్థ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ఇందులో స్వచ్ఛంద సంస్థల్ని కూడా భాగస్వామం చేస్తామని మేయర్ కావటి శివ నాగమనోహర్ నాయుడు తెలిపారు. నగరంలోని శ్రీనివాసరావుతోటలోని హిందూ శ్మశానవాటికను కైలాసభూమి మొదటి ఫేస్ కింద రూ. 2.70 కోట్లతో గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో, స్థానిక పెద్దల సహకారంతో అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలోని శ్మశానాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. నగరంలోని శ్రీనివాసరావుతోట శ్మశానవాటికను సుమారు 8 డివిజన్లలోని లక్ష మంది దాకా వినియోగిస్తున్నారన్నారు. ఇందులో గ్రీనరీతో పాటు పెదకర్మ, ఇతర కార్యక్రమాలు నిర్వహణ, కొన్ని రోజుల పాటు అక్కడే ఉండే నిమిత్తం గదులు, భోజన, వంటశాలలు, కేశఖండనం, స్నానపు గదులు, అస్థికలు భద్రపరచే గదులు, శ్మశానవాటిక బయట రోడ్డు విస్తరణ, ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. పార్థివదేహాల్ని భద్రపరిచేందుకు ప్రత్యేకంగా ఐస్ మార్చురీ గదులు, ఇతర బాక్సులు, పలు దేవతామూర్తుల విగ్రహాల్ని కూడా ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. నగరంలోని శ్మశానాల్ని అభివృద్ధి చేయడానికి స్వచ్ఛంద సేవా సంస్థల సహాయ, సహకారాలు కూడా తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు నిమ్మల వెంకటరమణ, గేదెల నాగ రంగమణి, సాదు ఉమామహేశ్వరి, కాండ్రుకుంట గురవయ్య, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, రమేష్, రాజేష్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు రమేష్, రమణబాబు, నగరపాలక సంస్థ డీఈఈ రమేష్‌బాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే విద్యకు పెద్దపీట

ఎమ్మెల్యే ముస్తఫా



మహిళకు ప్రభుత్వ పథకాల కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే పాఠశాలల అభివృద్ధి జరిగిందని, మౌలిక వసతులు కల్పించడంతో పాటు, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన బోధనతో ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. 56వ డివిజన్ నెహ్రూనగర్‌లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సమస్యల్ని ప్రజల నుంచి ఎమ్మెల్యే ముస్తఫా అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అర్హత కలిగి సంక్షేమ పథకాలు అందకపోతే, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది దరఖాస్తు చేయించి వారికి అందేలా చూడాలని సూచించారు. అనంతరం నెహ్రూనగర్ 7వ లైనులోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న వసతులు పరిశీలించి హాజరుశాతాన్ని అడిగి తెలుసుకున్నారు. గతం కన్నా విద్యార్థుల సంఖ్య పెరిగిందని ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం ఆ ప్రాంతంలో రేషన్ వాహనాన్ని పరిశీలించి, బియ్యం, నిత్యావసర వస్తువులు అందుతున్న తీరును ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో ముందుకు తీసుకునివెళ్తున్న ఘనత సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. విద్యతోనే భవిష్యత్తు తరాలకు బంగారు బాట సాధ్యపడుతుందని గ్రహించి అనేక విప్లవాత్మక మార్పులకు సీఎం శ్రీకారం చుట్టారని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్పొరేటర్లు అయిశెట్టి కనకదుర్గ, యాట్ల రవి, అంబేడ్కర్, వైఎస్సార్ సీపీ నేతలు శ్రీనివాస్, నారకట్ల శ్రీనివాసరావు, తాళ్లూరి సురేష్, అబ్దుల్ సలాం, ఉమామహేశ్వరరావు, హుస్సేన్, నాగరాజు, బోసు, రమేష్, కన్నెగంటి విజయ పాల్గొన్నారు.

డాక్టర్ అమూల్యకు న్యూరాలజీ గోల్డ్ మెడల్



గోల్డ్ మెడల్‌తో డాక్టర్ అమూల్య, పక్కన డాక్టర్ కృష్ణ స్రవంత్

గుంటూరు మెడికల్: గుంటూరు ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ పాకనాటి కృష్ణ స్రవంత్ సతీమణి డాక్టర్ చదలవాడ అమూల్య సూపర్ స్పెషాలిటీ పీజీ న్యూరాలజీలో గోల్డ్ మెడల్ సాధించారు. కర్నాటక రాష్ట్రం మైసూరు జేఎస్ఎస్ అకాడమి ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చి డీమ్డ్ యూనివర్సిటీ నుంచి ఈనెల 6న జరిగిన 13వ స్నాతకోత్సవంలో ఆమె గోల్డ్ మెడల్ అందుకున్నారు. స్థానిక గుంటూరువారితోటలోని ఆస్పత్రిలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పలువురు వైద్యులు వైద్య సిబ్బంది అమూల్యను అభినందించారు.కార్యక్రమంలో కార్డియాలజిస్టు డాక్టర్ గాలి దీప్తి, కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ ఇమ్మడిశెట్టి మారుతీప్రసాద్, నెఫ్రాలజిస్టు డాక్టర్ రాజశేఖర్, పల్మనాలజిస్టు డాక్టర్ జి.వి.కాశీరామ్, యూరాలజిస్టు డాక్టర్ శరత్, క్రిటికల్ కేర్ స్పెషలిస్టు డాక్టర్ శిరీష్, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫైన్ ఆర్ట్స్ అధ్యాపకుడికి 'కళారత్న' పురస్కారం



జాన్ రత్నబాబును సన్మానిస్తున్న వీసీ

ఏఎన్‌యూ: నాగార్జున యూనివర్సిటీ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ కళాశాల అధ్యాపకుడు జాన్ రత్నబాబుకు 'కళారత్న' పురస్కారం లభించింది. ఆయన్ను సోమవారం యూనివర్సిటీలో వీసీ ఆచార్య పి. రాజశేఖర్ సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌కి చెందిన కళారత్నం ఫౌండేషన్ ఆఫ్ ఆర్ట్ సొసైటీ గత ఏడాది డిసెంబరు 10, 11 తేదీల్లో వార్షిక ఆర్ట్ కాంటెస్ట్ నిర్వహించిందని తెలిపారు. ఇందులో ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల నుంచి ఐదువేల మంది కళాకారులు పలు విభాగాల్లో చిత్రాల్ని పోటీలకు పంపగా తాను పంపిన చిత్రం ఎంపికైందని వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి. కరుణ, ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ఈ. శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు నిరుపమ, ఫైన్ ఆర్ట్స్ విభాగ కో-ఆర్డినేటర్ శేఖర్‌బాబు, అధ్యాపకుడు దేవకాంత్ పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్‌లో సురేష్‌కు ద్వితీయ స్థానం



సురేష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మనోహర్, కోచ్ అశోక్‌కుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో ఇటీవల నిర్వహించిన ఏఎన్‌యూ అంతర్ కళాశాలల పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో టీజేపీఎస్ డిగ్రీ కళాశాల బీకాం తృతీయ సంవత్సర విద్యార్థి జి.సురేష్ 93 కేజీల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ తెలిపారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో సోమవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బరువులు ఎత్తడం అనేది భారతదేశంలో అతి ప్రాచీన క్రీడ అని, వీటి వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు త్వరగా ఉపాధి అవకాశాలు వస్తాయని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో పాల్గొనాలని చెప్పారు. కళాశాల కరస్పాండెంట్ తెల్లాకుల శ్రీనివాసబాబు, డాక్టర్ జేవీ సుధీర్ కుమార్, అధ్యాపకులు సురేష్‌ను అభినందించారు.